కథానిక :

# ★ వృశ్చికం ★

ఫయిల్సు చంకను పెట్టుకుని ఆఫీసు నుండూడి పడ్డాడు విశ్వం,

కొంప చేరుకునే ముందు నాలుగు రోడ్ల సెంటర్లో కాస్త ఆగి "ముష్కీ-కిమామ్" కిల్లీ ఒకటి బిగించి మరీ ఇంటికి వెళ్ళడం విశ్వాని కలవాటయి పోయింది.

అక్కడ ముష్కీ కిమామ్ కిల్లీ వేసుకుంటే, చచ్చినట్టు ప్రతి రోజూ సెంటర్లో కొచ్చినప్పుడల్లా ఆ కొట్టు దగ్గర ముష్కీ-కిమామ్ పాన్ వేసుకు తీరవలసిందే. దేనికీ లొంగని విశ్వం; కిల్లీకి దాసుడయిపోయేడు.

కిల్లీ బుగ్గ నుంచుకొని ఇంటి ముఖం పట్టేడు. "ముష్కీ-కిమామ్" రెండూ కలసి వసాళాన్ని అందుకున్నాయి.

"ఏం గురూ!" వెనుక నుండి ఎవరో పిలిచేరు. అర్థం గాక, తిరిగి చూసేడు విశ్వం.

"నిన్నే గురూ!" అన్నాడు మళ్ళీ. కిల్లీకొట్టు దగ్గర బెంచీ మీద కూర్చుని రోజూ న్యూసుపేపరు చదివే ఆయన.

ఆయనగారు నెల రోజుల నుండి గెడ్డం కొట్టించినట్టు లేదు. గుడ్డలన్నీ చూసి అలుగ్గుడ్డల్లా వున్నాయి. విశ్వం ఆయనతో ఎప్పుడూ మాట్లాడలేదు. అయినా రోజూ ఆయన్నక్కడ చూస్తూనే వున్నాడు. ప్రపంచ వార్తల దగ్గర నుండి స్థానిక వార్తల వరకూ రోజూ అక్కడ కూర్చుని సమీక్షిస్తూంటాడు.

"హిందూ ధర్మాదాయాల బిల్లు గురించి రిపోర్టు చదువుతున్నాం గురూ! రెండణా లుంటే యిలా పారేయ్. కాస్త టీ కొట్టి రావాలి" ఆయన లేచి విశ్వం దగ్గర కొచ్చి చెయ్యి చాపుతూ అడిగేడు.

విశ్వానికి నెత్తి మండుకొచ్చింది. మాట్లాడకుండా నైడు కాలువలో తుబుక్కున వుమ్మి చరచరా అంగలు వేసుకుంటూ బీచీని పట్టాడు.

వైశాఖ మాసం అయినా వర్షాలు అప్పుడే ప్రారంభం అయేయి. అక్కడక్కడ చెదిరి కట్టుగా వున్న మేఘాలన్నీ ఒక్క దగ్గరకు చేరుకుంటున్నాయి. బీచిలోని సువాసన కొడుతుంది. మనుషులట్టే తిరగడం లేదు. విశ్వం ఆలోచనలో పడ్డాడు.

లయిటు హౌసు చివరినుండి సముద్రంలో లయిటు పడింది. పడి డాల్ఫిన్సు నోసు మీదికి మళ్ళింది. అక్కడ నుండి యిటు తిరిగి అవా మహలు వైపు పోయింది. యింకా దూరంగా స్కాండిల్ పాయింట్ వరకూ ప్రసరించింది. యీ మధ్యలో ఒకసారి హార్బర్లో జాగా లేక సముద్ర గర్భంలో లంగరేసు కూర్చున్న స్టీమరుతో ఊసులాడి ఆగనైనా ఆగకుండా వచ్చిన వైపే వెళ్ళిపోయింది. ఎప్పుడూ యిల్లా తిరుగుతూండడమే నేమిటి చెప్మా! దాని బ్రతుకు; అనుకున్నాడు విశ్వం.

రోడ్డు మీద పిట్ట మనిషయినా లేదు. అంతా ఏమయిపోయేరు? కాల్ టేక్స్ అయిల్ రిఫయినరీలో జాయనయి పోయారేమిటి? హార్బరు స్కీములో కూడా మంచి ఉద్యోగాలు దొరుకుతున్నాయట. ఆఫీసులో అదేగోలగా చెప్పుకుంటున్నారు. విశ్వం బలువుగా వూపిరి పీల్చుకున్నాడు.

కొంప దగ్గర పడుతుంది. ఎంత పెద్ద మేడుంది: బోడిమేడ! ఏందుకని! అన్ని

రచన

**శ్రీ పూసపాటి కృష్ణంరాజు**

గదులూ పావురా పిట్టగూళ్ళలా వున్నాయి! కట్టించుకున్న వాళ్ల కాస్త నివాసయోగ్యంగా కట్టించుకోరూ? పాతిక రూపాయలు అద్దె గుంజుకుంటున్నారే! యీ నెల నుండి అద్దె పెంచుతానంటుంది ఇంటావిడ.

కాల్ టేక్సూ, హార్బరు స్కీమూ అమల్లోకి రావడం కాదు గాని ఇళ్ళకు డిమేండు మాత్రం పెరిగిపోయింది. పట్నంలో ఇళ్లు మాత్రం పెరగడం అవుపించదు. అందుకనే ఆవిడ అద్దె పెంచుతానంటుంది. ఐదుగురు పిల్లలతో ఆ గూట్లోనే పడి చస్తుంది. గాని, యింకో గదయినా స్వంతాని కుంచుకోదు. అద్దె పోతుందని భయం. పిల్లలందర్నీ గూట్లో దిమ్మరిస్తూంది. కుక్కిన పేనుల్లా పడుంటారు కాబట్టి సరిపోతుంది తన పిల్లల్లా అవుతేనా!

వెదవ యిద్దరి గుంటలతోనే ప్రాణం విసిగిపోతుంది. పెద్దవాడినిక అడగే అళ్ళ ర్లేదు. "హాయ్ డాడీ! హేయ్ డాడీ!" అని మీద పడతాడు. రెండో క్లాసు గుంటడికి ఇంగ్లీషు ముక్కలు బాగానే వచ్చేయి. బీచీ నిండా ఆంగ్లో యిండియన్ పిల్లలే కదూ....వాళ్ళ దగ్గర నేర్చుకునుండాలి. అంతకంటే వీడికెలా వస్తాయి? దానికి ఇంగ్లీషంటేనే తెలీదు. మళ్ళా నాతో కాపురం చేస్తుంది. యిక చిన్న వెదవ ఒకటే గోల—రావణా గోల; బడికి వెళ్ళరా అంటే ఏడుపు—వాడితో వేగడం కష్టమై పోతుంది. యిక దాన్ని కాస్త పిల్లల్ని కనొద్దని చెప్పాలి. లేకపోతే ఎవడి తరం బాబూ! అనుకుంటూ తనలో తనే నవ్వుకుంటూ విశ్వం గడప చేరుకున్నాడు.

"లాన్నే, లాన్నొచ్చా" అని చిన్న పిల్లాడు విశ్వం కాళ్ళమధ్యను దూరేడు. విశ్వం పిల్లలంటే ఎంత దూరంగా వుందామనుకుంటున్నా చిన్నాడిని తీసి ముద్దులాడకుండా వుండలేకపోయేడు.

"ఏరవండీ! యేవండీ! బందర్నుంచి మా నాన్నారు ఉత్తరం వ్రాసేరు, మా చెల్లెలు ప్రసాదానికి పెళ్ళి నిశ్చయం అయిందట, రేపు పదో తారీకునేనట. టయిము కూడా లేదు. "నేను రావడానికి వీలుపడదు పెళ్ళి పనుల్లో తిరుగుతున్నాను. వెంటనే నువ్వూ, అల్లుడూ కలసి పిల్లల్ని తీసుకుని రావలసింది" అని వ్రాసేరండీ" అంటూ గ్రుక్కతిప్పుకోకుండా వరండాలో నుండి వస్తూనే చెప్పి ఉత్తరం విశ్వం చేతిలో పెట్టింది.

అన్నపూర్ణ ముఖం ఆ సంతోషంలో ప్రణంధాల్లో వర్ణించినట్టుంది. విశ్వం ఉత్తరం చదువుదామని విప్పుతున్నాడు.

"అమ్మా! అమ్మా! ఎప్పుడే బందరెళ్ళడం?" అనుకుంటూ ఎక్కడో ఆడుకుంటున్న పెద్ద పిల్లాడు పరుగు పరుగున వచ్చి నిలుచున్న విశ్వాన్ని చూడకుండా, ఆ పరుగులో వచ్చి ఒక్క దేష్ ఇచ్చేడు. విశ్వం చంకలో నున్న ఆఫీసు కాగితాలన్నీ ఆ తోపుతో జారి గదినిండా చిందర వందరగా పడ్డాయి.

"కళ్లు కనుపించడం లేదు వెదవకి" అని వాళ్ళమ్మ ఒక్క చరుపు వీపుమీద వడ్డించింది. ఏడుపు ముఖం పెట్టి వెళ్ళి గుమ్మం దగ్గర నిలుచున్నాడు.

విశ్వం ఉత్తరం చూసి అన్నపూర్ణ చేతిలో పెట్టేసేడు.

"కాఫీ వుందేవిటి?" అనడిగేడు.

"కాఫీ మాటకేం గాని ముందీ గొడవ తేల్చి చెబుదురూ" అని కూర్చుంది విశ్వం భార్య.

విశ్వానికి చిట్టెత్తు కొచ్చింది. జీతం ఫస్టు తారీకు కొస్తే రెండో తారీకునే అన్ని బాకీలకూ జమ కట్టేసేడు. అప్పుడే రెండు రోజులయి చేతిలో చిల్లి గవ్వ కూడా లేదు. యివ్వాళ ఆఫీసులో వరహాలు మంచాడు కాబట్టి అడగ్గానే రెండు రూపాయలు అప్పు పెట్టేడు.

విశాఖ పట్నం నుండి బందరు వెళ్ళాలంటే మాటలా? చిన్న పిల్లాడికి టిక్కెట్టు కొనకపోయినా రెండున్నర టిక్కెట్లు కొనాలాయె! రెయిల్ చార్జీలకే నలభై రూపాయ లయిపోతాయి, పెళ్ళికి వెళ్ళగానే సరా! మరదలు పెళ్ళికి వెళ్ళింతరువాత చదివింపులేవీ లేకుండా తిరిగేస్తే నావర్థా కదూ! దీనికేం తెలుస్తూంది నేనెన్ని పుట్టాకులు పడుతున్నదీను, విశ్వానికి తల తిరిగింది.

"పెళ్ళీలేదు పెటాకులూ లేదు, ముందు కాఫీ తెచ్చిపెడుదూ" అన్నాడు కొంచం హెచ్చు స్థాయిలోనే.

"అదేవిటండీ, శుభమా అని ఏదో చేసుకుంటుంటే మీ నోటికేంతోస్తే అంతేనా" అంది కొంచం మొఖం ముడుచుకుని.

"తరువాత నెప్పుడయినా వెడదాంలే. మరి చెల్లెళ్ళు లేరా ఏవిటి పెళ్ళుళ్ళకి?" అని ఎత్తి పొడిచేడు.

"వుంటే వుంటారు మీకు లేరా. ఏవిటి మంద; వాళ్ళంతా వచ్చి కుర్చుంటే ఎద్దులా నా చేత చాకిరీ చెయ్యించొచ్చు గాని నా చెల్లెలు పెళ్ళికి వెళ్ళడానికి నోచుకోలేదూ!" అంది దీర్ఘాలు తీస్తూను.

"అంతే నోచుకోలేదు ఫో" అన్నాడు విశ్వం గది నిండా చిందర వందరగా పడ్డ ఆఫీసు కాగితాలను పోగు చేసుకుంటూను.

"నోచుకోలేదు; ఎందుకు నోచుకోలేదు మానాన్న రెండువేలు పోసేరు, మరో రెండు వేలు పోస్తే ఏ ఆఫీసర్నో, లెక్చరర్నో కట్టుకుని సుఖంగా వుందునూ" అంది అన్నపూర్ణ విశ్వం వైపు చూడకుండానే.

విశ్వం గతుక్కుమన్నాడు. విశ్వాని కెక్కడలేని కోపం ముంచుకొచ్చింది. అన్నపూర్ణ గూబ రేగిపోయేలా చెంప పెట్టు పెట్టేడు. టమోటా పండులా వుండే అన్నపూర్ణ బుగ్గ విశ్వం చేతి చలువతో ఎర్రగా కందిపోయింది. విశ్వం కోపం ఆపుకోకుండా మరో రెండు గుద్దులు పడేసేడు.

అన్నపూర్ణ ఆ దెబ్బలతో గుమ్మం మీదకు వెళ్ళి పడింది. పెద్ద పిల్లాడు హడలెత్తిపోయి గుమ్మం దగ్గరనుండి చూస్తున్నాడు. విశ్వం గదిలో పిచ్చెక్కినట్టు చిందులు త్రొక్కుతున్నాడు.—

అన్నపూర్ణ ఉక్కిరి బిక్కిరిగా ఏడుస్తుంది. విశ్వం పెద్ద పిల్లాడిని "లోపలకు రా" అని గట్టిగా పిలిచేడు. చిన్న పిల్లాడు కిక్కురు మనకుండా కుక్కిన పేనులా మంచంక్రింద దూరి పడున్నాడు.

"అమ్మోయ్! ఏదోనందోయ్! కుట్టేసింగందో! చచ్చానందో—నిజంగా చచ్చానందో! చీపురిలా పట్టుకు రందో! అదుగో నందో! అమ్మోయ్! పాకిరి పోతుందమ్మో! బిళ్ళ కుడుంలా వుందండీ" అంటూ అన్నపూర్ణ రాగాలు మొదలు పెట్టింది.

విశ్వం విస్తుపోయేడు. చీపురు కట్ట తీసుకుని గబగబా పెళ్ళాం దగ్గర కెళ్ళేడు.

"అదిగోనండీ! ఆ జెట్టీ చాటుకు వెళ్ళిందండీ, విషం ఎక్కిపోతుందమ్మా!" అని ఏడుపు లంకించుకుంది.

విశ్వం ట్రంకు పెట్టె ముందుకు లాగేడు. ఆవును నిజంగానే ఎఱ్ఱ తేలు! బిళ్ళ కుడుంలా వుంది. చీపురు కట్టతో ఫెడీఫెడీ మనిపించేడు. చీత్తు క్రింద నలిగిపోయింది.

పిల్ల లిద్దరూ విశ్వం బుజాలమీదనుండి తొంగి చూసేరు. విశ్వం తేళుని జాగ్రత్తగా ఖాళీ అగ్గి పెట్టెలో పెట్టి వీధి కాలవలో పారవేసేడు,

అన్నపూర్ణ మంచం ఎక్కి పడుకుంది. విశ్వానికేమీ పాలుపోలేదు. వీధి చివార నున్న అప్పలస్వామి మంత్రం వేస్తాడని ప్రక్క వాటాలో అద్దెకున్న విమలమ్మ గారు చెప్పింది. వెంటనే పరుగు పరుగున వెళ్ళి అప్పలస్వామిని పిలుచుకొచ్చేడు.

అప్పలస్వామి క్రొత్త చీపురుపుల్లలు పట్టుకొచ్చి మంత్రం వేసేడు. కుంకుడు కాయలు అరగదీసి తేలుకాటు దగ్గర పట్టు వెయ్యమని చెప్పి వెళ్ళిపోయేడు.

విశ్వం విమలమ్మ గార్నడిగి రెండు కుంకుడుకాయలు తెచ్చి అన్నపూర్ణ కాలు మీద తేలు కాటుకి పట్టువేసేడు.

"అయ్యో! మీరు కాలు పట్టుకోవడం టండీ! నా ఖర్మ గానీ" అని మూలుగుతూ బాధ పడింది

"ఎలా వుందే? బాధ కొంచం తగ్గిందా! డాక్టర్ మందు తెమ్మన్నావా?" అని విశ్వం అడిగేడు.

"అదే పోతుందండీ! ఇందాకటి మీద యిప్పుడు కాస్త నయంగానే వుంది. మీరు భోజనం చెయ్యండి. వంకాయ మెంతికాయ చేసేనండీ, వెదవతెలివిగాని....కాఫీ గూడా మీకోసం అని ఫ్లాస్కులో అట్టే పెట్టేనండి....అడగ్గానే యిస్తే ఈ పాడుముండా తగువే రాక పోనేమో!" అని అన్న పూర్ణ బాధపడింది.

విశ్వం ఆ పూట భోజనం చెయ్యనే లేదు. పిల్ల లిద్దరకూ బువ్వపెట్టి చేతులు కడిగి పడుకో చెప్పేడు, అన్నపూర్ణ వచ్చి అన్నం వడ్డిస్తానంది. అన్నపూర్ణతో తను భోజనం చేసేనని చెప్పేడు. అన్నపూర్ణ దగ్గర కూర్చుని తేలు కాటు వేసిన దగ్గరి తన చేతితో మెల్లగా స్పర్శించేడు.

"నాకుమాత్రం పెళ్ళికి సరదాగా వెళదామని లేదటే! శుభ కార్యంలో నలుగురూ ముచ్చటగా గడపాలని అందుకుండడూ డబ్బులేక అల్లా అన్నానే గాని నాకూ వెడదామనే వుంది. రేపేవరినైనా అడిగి అప్పు పుట్టిస్తాను. అలాగే వెడదాం, ప్రయత్నిస్తే అదే దొరుకుతుంది. తప్పకుండా వెడదాం" అన్నాడు విశ్వం.

"మొన్ననే కథటండీ నెల. అప్పుడే జీతం అంతా మండబెట్టేసేడా!" అనడిగింది

అణా పైసలుతో సహా అన్నీ జమా ఖర్చులు చెప్పేడు విశ్వం. అన్నపూర్ణ ప్రక్క వాటావాళ్ళతో కలసి మల్లేశ్వరి సినిమాకు వెళ్ళిన ఖర్చు గూడా వుంది ఆ లిస్టులో.

ఉదయాన్నే అన్నపూర్ణ కాఫీతెచ్చి భర్తకిచ్చింది. విశ్వం కాఫీ త్రాగి ఫెయిర్ కాపీలు చేసి ఫయిల్సు రెడీ చేసుకున్నాడు.

భోజనం చేసి ఆఫీసుకు వెళ్ళేడు. ఆఫీసుకెళ్ళే ముందు తిరిగి అన్నపూర్ణ బందరు ప్రయాణం గురించి ప్రస్తావించలేదు.

విశ్వం రోజులా లేడు. యీ రోజున బీచీలో ముఖం దించుకునే నడిచేడు. సెంటర్లో ముష్కీ-కిమామ్ కిల్లీగూడా ఆతన్ని కదపలేదు. విశ్వాని కింకో ఆలోచనే లేదు. ఆఫీసులో తన సీటు ముందు కూర్చున్నాడు, అప్పు ఎవర్నడగనా అని ఆలోచిస్తున్నాడు.

సెంటర్లో కిళ్ళీ కొట్టు ముందు మానిన గెడ్డపాయన చార్‌మినార్ సిగరెట్టు గట్టిగా దమ్ము పట్టి పొగనంతా మ్రింగేసి దిన పత్రికలో పతాక శీర్షికలను చూస్తున్నాడు.

"ఏమే! అన్నపూర్ణా! బందరెప్పుడేవిటి వెళ్ళడం?" అనుకుంటూ విమలమ్మ గారొచ్చింది.

"చిన్న చీటీ ముక్క వ్రాయగానే తెలిపోతానా! ఇంట్లో పెళ్ళి తలపెట్టింతరువాత ఆడపిల్లనన్నదాన్ని తండ్రో తోబుట్టువో వచ్చి తీసుకెళ్ళక్కర్లేదూ? ఆ జ్ఞానం వుండొద్దూ? చీటీ ముక్కమీద వెళిపోతానా? అంత చచ్చి కూర్చున్నానా? బందరూ లేదు గిందరూ లేదు. నే వెళ్ళడం లేదు" అని అన్నపూర్ణ వాళ్ళ వాళ్ళను ఒక దులుపు దులిపేసింది.

విశ్వం గదిలో వున్నాడేమో అని విమలమ్మ గుమ్మంలో నిలుచుని తొంగి చూసింది.

విశ్వం ఇంట్లో లేడు. ఆఫీసుకెళ్ళిపోయేడు.

అన్నపూర్ణ విర్ణయానికి విమలమ్మ గారు ఆశ్చర్యపోయింది. ✱


మీకు ఆనందము నిచ్చు బీడీలు!




పోస్టు బాక్సు నెం. 31. చిత్తూరు.